విలువ

'కవిత'

"రండి రండి మీ రిద్దరూ వొచ్చారంటే ఏదో విశేషమున్నదన్న మాటే." ఆహ్వానించింది శకుంతల.

శ్యామలా నీరజా శకుంతల వేసిన చాపమీద కూర్చున్నారు. "మా విశేషం ఉంది కానీ_ నీ సంగతి చెప్పు "

"నా సంగతా! ఏముందని?" తెల్లబోయింది శకుంతల.

"తలంటుకున్నావ్ పసుపు రాసుకుని "

శకుంతల సిగ్గుపడుతున్నట్లు తల వంచుకుంది.

"మా చెల్లి పెళ్ళి కుదిరింది పదిహేను రోజుల్లో ముహూర్తం."

"ఎంత మంచి వార్త చెప్పావు!" అంటూ నీరజ ముఖంలోకి చూసింది.

నీరజ కన్నులలో కొత్త కలలు. ఆమెముఖంలో కొత్త కాంతులు. పెళ్లనగానే ఆడపిల్లలో ఎంత ఆశ! ఎంత మార్పు!

"పెళ్లికొడుకేం చేస్తున్నాడు?" శకుంతల నీరజనే అడిగింది.

సమాధానం_ శ్యామల చెప్పింది. "ప్రయివేటు కంపెనీలో గుమాస్తా. నెలకి అరువందలు జీతం."

"బాగుంది." అభినందిస్తున్నట్లంది.

కొంచెంసేపు కబుర్లు సాగాయి.

శకుంతల_ నీరజ ముఖాన్ని పట్టిపట్టి చూసింది, అవకాశం దొరికినప్పుడల్లా.

"వెళ్లొస్తా. బావగారు వచ్చే వేళయింది." అంటూ లేచింది శ్యామల.

"బొట్టు పెడతా ఉండు." లోపలికి వెళ్లి కుంకుమ భరిణ తెచ్చింది. బొట్టు పెడుతూ_ అతి దగ్గరనుంచి_ మరీ పరిశీలనగా చూసింది నీరజ ముఖాన్ని. నీరజ కళ్లనిండా కమ్మని కలలు. ముఖంలో కొత్త కాంతులు.

ఆమె ఊహాలోకాల్లో తేలిపోతూంది. కాబోయే భర్తతో_గడపబోయే దాంపత్య

జీవితం గురించి ఏమేమి తీపికలలు కంటూందో!

వాళ్లిద్దరూ వెళ్లిపోయారు.

వాళ్లెందుకు వచ్చిందీ శకుంతల అర్థంచేసుకుందుకు ప్రయత్నించసాగింది. ఆడపిల్ల - ఏమీ దాచుకోలేని బేల. ముఖ్యంగా పెళ్లి గురించి. పెళ్లి కావడం ఆమె జీవితానికి పెద్ద పండుగ. ఏకైక గర్వ కారణం. ఆ సంగతి ఎవరికైనా చెప్పుకుంటే ఎంత ఆనందం కలుగుతుంది. శ్యామలా నీరజా వచ్చింది పెళ్లి కుదిరిందని చెప్పడానికే!

శకుంతల అప్రయత్నంగా ఒక్క నిట్టూర్పు విడిచింది.

ఆమె కన్నులలో హటాత్తుగా నీరు చిమ్మింది. చీరకొంగుతో తుడుచుకుంటూ లోపలకు నడిచింది. అద్దంముందు కూర్చుంది. ముఖానికి పౌడరు రాసుకుంది. బొట్టు తీర్చి దిద్దుకుంది. జడలో పూలదండ పెట్టుకోబోయి—అంతలోనే ఏదో జ్ఞాపకంవచ్చినట్లు ఆగిపోయింది.

శ్రీవారు రావాలి పూలదండ ముడవాలి. అప్పుడే అందమూ ఆనందమూ. ఇంకా రాలేదేం? భయంగా గడియారం వంక చూసింది.

ఆరుకి ఐదు నిముషాలు మాత్రమే ఉంది.

ఆఫీసు—ఐదుకి వదులుతాడు. బస్ కోసం మరో అరగంట అనుకున్నా యీ పాటికి వచ్చెయ్యాలి. ఉదయం వారిని నిద్రలేపుతూ, పాదాలకు నమస్కరించింది.

"ఏమిటి విశేషం? ఓహ్? ఇవాళ ఫస్టు తారీకు జీతాల రోజనా!" కాఫీ కప్పు అందుకుంటూ నవ్వారు.

"ఇవాళ- మన మ్యారేజ్ డే" బాధపడుతూ గుర్తుచేసింది. ఇంతకంటె దురదృష్టం ఏం కావాలి? తను జ్ఞాపకం చేస్తే తప్ప 'మ్యారేజ్ డే' జ్ఞాపకం రాదు వారికి! ఈ రోజుకోసం వారం నుంచీ కలలు కంటూ ఎదురుచూస్తూ వచ్చింది తను. ఆయనకేమీ పట్టదు!

"ఓహో! నువు అదృష్టవంతురాలివి. పేదే నాచే మ్యారేజ్‌డే కనుక కొత్తచీర తేలిగ్గా వస్తుంది. సాయంత్రం వస్తూ తెచ్చేదా? నువ్వూ వస్తావా బజారుకి?"

"నేనూ వస్తాను."

ఆయన నవ్వుతూ- "ఆడవాళ్లకి సెలక్షన్ మీద నమ్మకం తక్కువ. కాని—శకుంతలా మీ చీరెలకు బ్లౌజులకూ డిజైన్లు వేసేదీ రంగుల కాంబినేషన్ నిర్ణయించేదీ మగవాళ్లే సుమా!" అన్నారు.

ఆయన మీద జాలివేసింది. కోపమూ వచ్చింది.

నమ్మకం లేనిది- మీ సెలక్షన్ మీద కాదు మీమీదే అని సూటిగా చెప్పేద్దామన్నంత ఆవేశం వచ్చింది. ఏలాగో నిగ్రహించుకుని—మౌనంగా ఊరుకుంది.

"సరే పావుతక్కువ అరుకి వచ్చేస్తాను." అన్నారాయన.

సందేహిస్తున్నట్లు చూస్తూ– "ఇవాళ పేడే." అంది తను.

సమాధానం చెబుతున్నట్లే–"మ్యారేజ్ డే–" అన్నారు వారు నవ్వుతూ. తను నమ్మలేకుండా ఉండలేకపోయిందిక. సాయంత్రం వారు ఆఫీసునుంచి వచ్చాక ఏం చెయ్యాలో ఎలా గడపాలో ఊహించుకోసాగింది. ఊహలు ఎంత తియ్యగా ఉంటాయి కొన్ని కలలలాగ!

ఏదో గుర్తువచ్చినట్లు – వంటిట్లోకి పరుగెత్తింది శకుంతల. పొయ్యిమీద నీళ్లు మరిగిపోతున్నాయి. వారు వస్తే తలంటి స్నానం చేయిద్దామని వేన్నీళ్ల పెట్టింది. అరయింది కాని వారి జాడ లేదు. ఏం చెయ్యాలి?

వారు వస్తారు. తలంటి–టిఫిను పెట్టి– బజారుకి బయలుదేరదీస్తుంది. వారు తన కొాక చీర కొంటారు. తను వారి కొకజత రెడీమేడ్ బట్టలు కొనిపిస్తుంది. ఇంటికి వచ్చి కొత్త బట్టలు వేసుకొని– ఏ హోటల్లోనో భోజనం చేసి– సినిమాకి వెళ్తారు. తిరిగి వచ్చాక మధురంగా గడుపుతారు. ఇలా ఊహించుకుంది తను– మ్యారేజ్ డే చక్కగా గడపాలని.

పురిట్లోనే సంధికొట్టినట్లు– వేళకు వారు రానేలేదు.

తను ఎప్పుడూ వారినేమీ అడగదు. ఇవాళ మ్యారేజ్ డే కనుక త్వరగా యింటికి రమ్మంది. ఈ చిన్న కోరిక తీర్చడం కూడా వారికి అసాధ్యమైపోతూంది!

శకుంతలకి దుఃఖం వచ్చింది. పెళ్లి రోజుపూటా కన్నీరు పెట్టడం యిష్టంలేక ఆపుకుంది. ఏం చేయాలో తోచక అటూ యిటూ తిరగసాగింది వీధిలోకి ఇంట్లోకి.

చీకటి పడుతుంది.

వారు రాలేదు.

ఆమె మనసులో ఏవేవో అనుమానాలు.

వారెక్కిన సిటీ బస్‌కి ప్రమాదం జరుగలేదు కద?

వద్దు భగవాన్ అలా జరుగకుండా చూడు. నేను నిన్ను కోరుకునేది వారి క్షేమమే. నా ప్రార్థన మన్నించు.

గదిలోకి వచ్చిందామె. మంచం దుప్పటిమీద మల్లెపూలు నీటుగా అందంగా తయారుచేసి ఉంచింది. దాన్ని చూసేసరికి మళ్లీ దుఃఖం వచ్చింది. తన ఆశలూ కలలూ ఊహాస్వర్గాలూ అన్నీ వ్యర్థమేనా?

గడియారం తన విధి తను నిర్వర్తించుకుంటూ పోతుంది.

కాలం — రాత్రి గడిచిపోతూంది. వారింకా రాలేదు.

ఈపాటికి వేడినీళ్లు చల్లారిపోయే ఉంటాయి తన ఆశలలాగ చప్పగా– అనుకుంది శకుంతల. ఇంక ఆమె ఏడుపు ఆపుకోలేకపోయింది.



గదిలో దీపమయినా వేసుకోలేదు. చీకటిలోనే కూర్చుందామె.

జీవితంమీద విరక్తీ అసహ్యమూ కలగసాగా యొక్కసారి ఆమెలో.

ఏం బ్రతుకిది? అతి చిన్న కోరిక కూడా తీరనంత- నిస్సార జీవితం!

ఎందుకిలా బ్రతకడం? సాధించాలని? శాపంలాటి ఎడారిలాటి యీ బ్రతుకు బ్రతకడం కంటె ఒక్కసారి ఉరి పోసుకు చావడం మేలు కాదూ? బ్రతకడానికీ - చావడానికీ తేడా ఏముందని తన విషయంలో?

తను బ్రతుకుతున్నదే జీవచ్ఛవంలా.

వివాహమయినా తను ఒంటరిది! ఎటువంటి శాపమిది!

దేముడికి తనంటే నిర్దయే కాబోలు. లేకపోతే తనకొక చిన్న పాపాయినిచ్చి ఒంటరితనం నుంచి విష్కృతి కలిగించేవాడు కాదూ?

ఎనిమిది.

ఎటువంటి దుస్సహమూ దుర్భరమూ అయిన పరిస్థితి.

పెళ్లిరోజు సంతోషంగా సుఖంగా వారితో గడపడానికి బదులుగా- చీకటిలో ఒంటరితనంలో దుఃఖంలో మగ్గిపోవలసిరావడం.

కన్యగా ఎన్ని కలలు కంది!

వివాహమంటే - జీవితాని కత్యంత సుందరమయిన మలుపే అనుకుంది.

శ్రీవారితో కాపురం-స్వర్గలోకవాసమే అనుకుంది.

బ్రతుకంతా అద్భుతమయిన అనుభూతులూ అనుభవాలూ అనుకుంది.

ఏవీ ఆ కలలు?

ఏవీ ఆ ఆశలు?

తొమ్మిది.

గడియారం తనని చూసి వెక్కిరిస్తున్నట్లే అనిపించింది.

లేచివెళ్లి - తలుపులువేసి వచ్చింది.

ఏం చేయడానికీ పాలుపోవడం లేదు.

అలంకరించిన మంచం తనని హాస్యం చేస్తున్నట్లే అనిపించింది. ఆమె మనసు జ్ఞాపకాలకు చోటివ్వసాగింది.

ఐదేళ్ల క్రితం

సరిగ్గా యిదే రోజు

కొన్ని గంటలలో ముహూర్తం.

హడావిడి

ఆనందం

ఆర్భాటం

పట్టుచీరలతో పసుపుపారాణిలతో

కోటి కలలతో శత కోటి ఆశలతో

మనసంతా కాబోయేవారిని నింపుకుని ఔను.

అప్పటికి_వారిగురించి ఉన్న ఊహలే. ఆశలే. కలలే.

వారి గురించి అసలేమయినా తెలిసి ఉంటేగా ?

పెళ్లి చూపులలో_ఒకే ఒక్క_సారి_ సిగ్గుతో కనులు వాలిపోతూంటే ఎలాగో క్రీగంట ఒకే ఒక్క_ చూపు కెమెరా క్లిక్ మన్నట్లు ఒక్క_చూపుకే వారు తన హృదయం మీద ప్రస్ఫుటంగానూ శాశ్వతంగానూ ముద్రించబడి

ఇక వారి సన్నిధి కెప్పుడు ఎంత త్వరగా చేరుతానా అని ఆరాటం. చదవ బోయే ఉత్తరంలా...వినబోయే పాటలా చూడబోయే దృశ్యంలా-ఎంత ఊరిం చారు వారు ?

అప్పుడు_వారిగురించి ఏమీ తెలియదు. కలలూ ఆశలూ ఊహలూ తప్ప. ఇప్పుడు_ వారి గురించి ఆశలు లేవు . కలలు లేవు ఊహలు లేవు. ఇంత కంటె దౌర్భాగ్యమూ దురదృష్టమూ ఏమిటి ? కలలూ ఆశలూ లేని జీవితం కంటె తీరని శాపమేముంటుంది మనిషికి? స్త్రీకి.

ఈ చిన్న నిజం_వారెందుకు గ్రహిం చరు ?

గ్రహించి_తనకీ కొంచెం జీవితం ఎందుకు ప్రసాదించరు ?

తనకీ ఓ మనసుందని ఆ మనసుకీ కోరికలూ సరదాలూ ఉంటాయని నిజంగా వారికి తెలియదా ? తెలిసినా నిర్లక్ష్యమా ?

తన జీవితంలో ఆలోచనలలో కొంచెమయినా చోటివ్వడానికి సిద్ధపడని మగవాడు అసలు పెళ్లెందుకు చేసుకో వాలి ?

పంచుకోకుండా_ జీవితమంతా తనకే ఉంచుకుందా మనుకునే స్వార్థపరుడికి వివాహం చేసుకునే అర్హత ఎక్కడుంది?

స్త్రీ స్వేచ్ఛ నంతటినీ హరించి తను మాత్రం విశృంఖలంగా విహరించ గలిగే అధికారం మగవాడి కెక్కడిది ? ఎలా సంక్రమించింది ?

భార్యను బానిస చేసి_ తను మాలిక్

కావడం సిగ్గుమాలినతనంగా తోచదా మగవాడికి? వివాహంలో —ఎన్ని వాగ్దానాలు చేస్తాడు! ఒక్కటి నిలుపుకోడే తరువాత! సిగ్గు వెయ్యదూ?

తనని నమ్ముకుని—స్వజనాన్నీ సర్వస్వాన్నీ వదులుకు వచ్చిన స్త్రీ— తన మూలంగా సుఖపడలేక దుఃఖభాజనురాలౌతుందంటే— ఆ భర్త అహం దెబ్బ తినదూ? అతని పౌరుషానికి లోటు కాదూ?

పది.

ఇంక పూర్తిగా అలిసిపోయింది శకుంతల ఆలోచించి ఆలోచించి. కన్నులవెంట నీరు కారుతున్నా తుడుచుకోకుండా కటిక నేల మీద వాలిపోయింది.

ఆమెకు నిద్ర మాత్రం రావడంలేదు. జీవితంలో పూర్తిగా దగాపడిపోయినట్లు భావన కలుగుతూ హృదయం నలిగిపోతూంది. ఏమిటీ జీవితం అనిపిస్తుంది. చీకట్లోనే— పైకి చూస్తూ ఉండిపోయింది. ఎంత వద్దనుకున్నా ఆమెలో ఆలోచనలు రావడం మానలేదు. బ్రతుకు భారంగానూ నిష్ఫలంగానూ తోచసాగింది.

రాత్రి గడిచిపోతూంది.

పదకొండు

పన్నెండు

శకుంతలకి— కోపం వస్తూంది చిరాకు వేస్తూంది. దుఃఖం వొస్తూంది.

నిద్ర మాత్రం రావడం లేదు. ఎలా వస్తుంది

ఆశాభంగం— నిద్రపట్టనివ్వదు. మనిషిని నిలువ నివ్వదు. మనసును కుదురుగా ఉండనివ్వదు.

"షకున్‌త లా "

పిలుపు వినిపించక పోలేదు.

ఐనా ఆమెకు లేచివెళ్లి తలుపు తీయబుద్ధి కాలేదు. ఒక విధమైన వైరాగ్యమూ నిర్లిప్తతా అనాసక్తతా ఆమె నావరించాయి. ఈ జీవిత మింతే అన్న విరక్తి నిండిందామెలో.

"షకుంతలా!" పిలుపుతో పాటు తలుపు మీద బాదాడు. విసుక్కుంటూ వెళ్లి తలుపు తీసింది.

"నిద్దరపోతున్నావా?"

ఆమె సమాధానం చెప్పలేదు.

అతని నుంచి వచ్చిన విస్కీ వాసనకి ముఖం చిట్లించుకుంది.

"కోపమా?"

నా బ్రతుకక్కడొక్కటే తక్కువ. పేదవాని కోపమూ ఆడదాని కోపమూ పెదవికి చేటు. అంతే.

"చీర తేలేదనా? "

ఇంక శకుంతల నిగ్రహించుకోలేకపోయింది. అతని దృష్టిలో తానేమిటి? ఎంత అల్పమైన అభిప్రాయం తనంటే! ఈయనేకాదు చాలామంది మగవాళ్లింతే. స్త్రీ అంటే చీరలూ నగలూ అని. కాని— నిజం వారికి తెలియదు. వారి ఆలోచనలు అంతకంటె లోతుగా సాగవు. వారి అజ్ఞానానికి జాలిపడి ఊరుకోవలసిందే.

స్త్రీని అంతకంటె అధికంగా అర్థం చేసుకోగలిగే మెదడూ హృదయమూ వారి కుండవు. దాసు ని తప్పులు దండంతో సరి అన్నట్లు- చేసిన పొర పాట్లని ఓ చీరతో సరిపెట్టబోతారు.

కాని- తనకి కావలసింది కొత్త చీర కంటె అధికమైన విలువగల అనుభవం. వాయ వేళకి యింటికి వస్తే- సరదాగా కబుర్లు చెప్తే- తనకెంత సంతోషం కలిగేది ! ఆ ఆనందం విలువెంత ? అది- ఆయన కర్థంకాదు. అదేమిదురదృష్టమో ఫ్రెండ్స్‌తో గంటలకి గంటలు బాతాకానీ వేసేవారికి తనతో చెప్పడానికి కబుర్లే ఉండవు ! ఎక్కడయినా పూటలకి పూటలు తేలిగ్గా గడిపేయగలిగేవారికి - యింట్లో అరగంట తోచదు !

"సారీ షకూ ! మరచిపోయాను... ఇవాళ మ్యారేజ్ డే కదూ ?"

"పన్నెండు దాటింది. తేదీ మారింది. . మ్యారేజ్ డే ముగిసింది" కసిగా అంది.

"రియల్లీ సారీ ! ఏమీ చేసేది ? ఫ్రెండ్స్ బలవంతం చేశారు. మందు పార్టీ చేసుకున్నాం. శాటరీ డే కదా ? ఖుషీ చేశాం. అఫ్‌కోర్స్ పేకాట ఆడు కున్నాం టైం తెలియలేను "

శకుంతల కోపం తారస్థాయినందు కుంది.

భర్తను చూస్తున్నకొద్దీ వొళ్లు మండి పోతూంది. అతని వివరణ వింటూంటే వొంటికి కారం రాసుకుంటున్నట్లే ఉంది.

"చాలా వేళయింది పడుకోండి-"

"థ్యాంక్స్ క్షమించావు కదూ నిద్దరొస్తూంది గుడ్‌నైట్ "

శకుంతల దీనంగా చూసింది ఔను. నిద్ర పోతూ గడిపే రాత్రులే నయం. మేలుకునే పగలు ఏమాత్రమూ ఆనంద దాయకంగా ఉండదు. ఉండాలని విష్ చేసుకోము. మనకి గుడ్‌నైట్‌లే కాని గుడ్‌డేలు లేవు.

"షకూ ! ఫ్రెండ్స్ అడిగారు కనుక కానీ లేకపోతే " నిషాలో ఏదో అంటూనే ఉన్నాడు అతను.

అతని మాటలు కుంటిసాకులు ఆమెకు వినిపించడం లేదు.

ఆమె హృదయం విషాదభరితమై ఉంది.

అతి తీవ్రంగా అవమానించబడినట్లు ఆమె మౌనంగా మిగిలిపోయింది.

ఆమె గుండెలు దహించుకు పోతు న్నాయి.

ఆమె ఆశలు సమూలంగా నశించి పోయాయి.

ఒక్కసారి —

శకుంతలకు-నీరజ జ్ఞాపకంవచ్చింది. పెళ్లి కాబోతూందన్న ఆనందంలో తేలి పోతున్న నీరజ

జాలిగా సానుభూతిగా అను కుంది శకుంతల.

పిచ్చి నీరజా ! అమాయకంగా పెళ్లంటే ఆనందిస్తున్నావు కానీ రేపు ఎదురవబోయే జీవితం యిలాగే



ఉంటుంది. వేలకొద్దీ కట్నం యిచ్చి నీ జీవితాన్నే అర్పిస్తావు మగవాడికి. అతని దృష్టిలో నీ విలువ అత్యల్పం. మిత్రులు కోరితే పార్టీ కుండిపోతాడు. భార్య వేడుకున్నా ఆమె మొర వినుపించు కోడు. నువ్వతని కోసమే ఆలోచిస్తూ పరితపిస్తూ ఎదురు చూస్తూ క్షణ క్షణమూ భారంగా గడుపుతావు. అతను నీ ధ్యాసేలేకుండా గంటలూ రోజులూ స్నేహితులతో కాలక్షేపం చేస్తాడు. నీ పర్వస్వమూ అతని కర్పించుకుంటావు. అందుకు ప్రతిఫలంగా అతను కొంచె మయినా తనవి నీకు అందనివ్వడు. అతనే నీకు సర్వసం. నువ్వతని కేమీ కావు. లోకంలో చాలా దాంపత్యా లింతే పెళ్లి_ మగవాడికే అన్ని లాభాలనూ, ఆడదాని కన్నీ కష్టాలనూ కలిగిస్తుంది. తీపిపూతని చూసి లొట్టలు వేసుకుంటు న్నావు.కాని అతికొందరలోనే సంసారపు తీపిపూత కరిగిపోయి చేదు మిగులు తుంది. అది మింగుతూ బాధపడవల సిందే జీవితాంతమూ. వివాహం_ స్త్రీని పురుషుడి వెంట పరుగెత్తిస్తుందే తప్ప పురుషుణ్ని స్త్రీతో సుందరంగా బంధించడంలేదు. అదే వ్యవస్థలో లోటు వివాహంతో_నీ కలలూ_ఆశలూ అన్నీ స్టాప్ సారీ నీరజా ! ఆడపిల్లగా నీ భవిష్యజ్జీవితం ఇలాగే సాగుతుందేమో. అందుకే సాటి ఆడదానిగా నీమీద జాలిపడకుండా ఉండలేకపోతున్నాను. ఈ బంగారుపంజరంలోకి మరో బందీగా రాబోతున్న నిన్ను చూసి జాలిచెంద కుండా ఉండలేకపోతున్నాను. అయినా_ నీకు శుభాకాంక్ష లందివాలని ఉంది. నీ అదృష్టం ఎలా ఉందో ? నీరజా విష్ యు బెస్టాఫ్ లక్ నాలాగ కాక నువ్వయినా సుఖసంసారానికీ నీకు విలువున్న దాంపత్యానికీ నోచుకో.